




దివిటిపల్లి వద్ద ఏడాదిగా రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో వన్‌వేలో వెళ్తున్న వాహనాలు

హైవే కనవే..

ఆంధ్రజ్యోతి విజిట్



పెబ్బేరు మండలం రాంపురం సమీపంలో పేర్లు చెదిరిపోయిన సూచిక బోర్డు



అడ్డాకుల టోల్‌ప్లాజా వద్ద రోడ్డుపైనే ఆపిన వాహనాలు

- ఉమ్మడి జిల్లాలోని 44వ నెంబర్ జాతీయ రహదారి వెంట వసతులు నిల్
- పని చేయని ఎస్‌వోఎస్ ఫోన్ బాక్స్‌లు
- నీళ్లు లేని ట్యాంకులు, అపరిశుభ్రంగా బస్టాండ్‌లు
- రోడ్డు పక్కన హోటళ్లు, దాబాల వద్ద వాహనాలు నిలుపడంతో ప్రమాదాలు
- జంక్షన్ల వద్ద రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులు
- కొమిరెడ్డిపల్లి వద్ద వెలగని హైమాస్ట్ లైట్లు
- జడ్చర్ల వద్ద ఇష్టానుసారంగా రోడ్డుపై వాహనాల పార్కింగ్
- పెబ్బేరు బైపాస్ వద్ద ప్రమాదాలకు కారణమౌతున్న క్రాస్‌గా ఉన్న రోడ్డు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 44వ జాతీయ రహదారి అసౌకర్యాలకు నిలయంగా మారింది. టోల్ వసూలు చేస్తున్నా, ఆ మేరకు సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన ఎస్‌వోఎస్ ఫోన్లు ఎక్కడా పని చేయడం లేదు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులు వృథాగా మారాయి. టోల్ ప్లాజాల వద్ద మూత్ర శాలలు, మరుగుదొడ్లు లేక వాహనదారులు ఆరుబయటకు వెళ్తుండటంతో ఆ ప్రాంతాలు దుర్వాసన వస్తున్నాయి. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్క్ చేస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చాలా చోట్ల సూచిక బోర్డులు లేవు. కిలో మీటర్లు తెలిపే బోర్డులు కూడా చెదిరిపోయాయి. ఇవన్నీ అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని రాయికల్ టోల్‌ప్లాజా నుంచి పుల్లూరు టోల్ ప్లాజా వరకు 152 కిలో మీటర్ల మేర ఉన్న జాతీయ రహదారిని 'ఆంధ్రజ్యోతి' బుధవారం విజిట్ చేసింది. ఈ సందర్భంగా ఎన్నో సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

- ఆంధ్రజ్యోతి: రాజాపూర్/ జడ్చర్ల/ భూత్పూర్/ మూసాపేట/ కొత్తకోట/పెబ్బేరు రూరల్/ఎర్రవల్లి/అలంపూర్ చౌరస్తా

ఉమ్మడి జిల్లాలోని 44వ జాతీయ రహదారి వెంట సౌకర్యాలు కొరవడ్డాయి. దాంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రాజాపూర్ మండలంలో జాతీయ రహదారి 10 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. రహదారిపై ఉన్న ట్యాంకులలో తాగునీరు ఏర్పాటు చేయడం లేదు. ట్యాంకులు నిరుపయోగంగా, అపరిశుభ్రంగా మారాయి. బస్టాండ్‌ల ముందు భారీ వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో అసౌకర్యంగా ఉంటోందని ప్రయాణికులు అంటున్నారు. ఎస్‌వోఎస్ ఫోన్‌లు పని చేయడం లేదు. రహదారిపై చిరు వ్యాపారులు జామకాయలు, ఇతర పండ్లు అమ్ముతున్నారు. వాటిని కొనుక్కునేందుకు వాహనదారులు రోడ్డుపై ఇష్టం వచ్చినట్లు పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతీ సోమవారం మండల కేంద్రంలో సంత జరుగుతుంది. ఆ రోజు రద్దీ ఎక్కువగా ఉండటంతో రోడ్డు దాటేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్య కూడలిలో సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ముదిరెడ్డిపల్లి స్టేజ్ వద్ద ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు వ్యతిరేక మార్గంలో వెళ్తున్నాయని, దాంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. భారీ వాహనాలు ఆపడానికి రహదారిపై ట్రక్ లే బైలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

పని చేయని ఎస్‌వోఎస్ ఫోన్లు

కొత్తకోట మండలంలో కనిమెట్ట శివారు నుంచి నాటవెల్లి గ్రామ శివారు వరకు 21 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. 26 బస్ షెల్టర్లు నిర్మించారు. ప్రతీ చోట వాటర్ ట్యాంకు ఏర్పాటు

(మిగతా 4లో..)

2006లో 44వ జాతీయ రహదారిగా మార్పు

జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా దేశంలోనే అతి పెద్ద రహదారి అయిన ఎన్‌హెచ్7ను 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు లేన్ల రహదారిగా విస్తరించి, 44వ జాతీయ రహదారిగా మార్చింది. ఆ తర్వాత నేషనల్ హైవే ఆథారిటీ అఫ్ ఇండియా వారి నుంచి ఏపీలోని కర్నూలు పట్టణం కృష్ణనగర్ నుంచి కొత్తకోట వరకు 74 కిలో మీటర్ల మేర ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటేడ్ కంపనీ వారు 25 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి ప్రయాణికుల అవసరాలను బట్టి ప్రతీ కిలోమీటరుకు ఒక ఎస్‌వోఎస్ ఫోను, ప్రతీ ఐదు కిలో మీటర్లకు ఒక ఎమర్జెన్సీ కాంటాక్ట్ బోర్డు ఏర్పాటు చేశారు. 45 బస్టాప్‌లు ఉండగా, ప్రతీ బస్టాప్ వద్ద వాటరు సౌకర్యం, నాలుగు ట్రాక్ లేబైలు నిర్మించారు. ఇక హైవేపై రెండు పెట్రోలింగ్ వాహనాలు, ఒక అంబులెన్స్, ఒక క్రేన్, 120 మంది సిబ్బంది పని చేస్తున్నారు. 74 కిలో మీటర్ల పొడవున రోడ్డు అంచులకు రెడ్ స్టడ్స్ ప్రతీ మలుపు, యూ టర్న్‌ల వద్ద బ్లింకర్స్ ఏర్పాటు చేశారు. అవసరమైన చోట హైమాస్ట్ లైట్స్‌తో పాటు సుమారు 1,500 వీధి లైట్లు ఏర్పాటు చేశామని ఏపీ ఎక్స్‌ప్రెస్‌వే పీఎం ఎస్‌జేవీ ప్రసాద రావు తెలిపారు. హైవేపై రోజూ 25 వేల వాహనాలు తిరుగుతుండగా శుక్ర, శని, ఆదివారాల్లో 30 వేలకు పైగా తిరుగుతున్నాయి. పుల్లూరు టోల్ ప్లాజా వద్ద టోల్ కలెక్షన్ సుమారు రూ.48 లక్షల నుంచి రూ.55 లక్షల వరకు వసూలు అవుతోంది. 85 మంది సిబ్బంది పని చేస్తున్నారు.



రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ దగ్గర పనిచేయని ఎస్‌వోఎస్ ఫోన్ బాక్స్



మల్లెబోయినపల్లి దగ్గర పని చేయని ఫ్లాషర్ లైట్స్



జడ్చర్ల మండలం గొల్లపల్లి దగ్గర రాంగ్‌రూట్‌లో వెలుతున్న వాహనాలు



వంద పడకల ఆస్పత్రి శంకుస్థాపనకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర

వైద్యం, విద్యకు పెద్దపీట

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ

దేవరకద్రలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ

దేవరకద్ర, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యం, విద్య, ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్ద చెరువు దగ్గర 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.35 కోట్లతో ఏడాదిలోపు ఆస్పత్రిని పూర్తి చేసి, మెరుగైన సేవలు అందిస్తామన్నారు. కార్డియాలజీ, డయాలసిస్, ఎమ్ఆర్ఐ వంటి వసతులను కల్పిస్తామన్నారు. దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాల్లో, ప్రతీ 30 కిల్లో మీటర్ల దూరంలో ఒక ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేసి, ప్రజల ఆరోగ్యాలను కాపాడతామన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందిస్తామన్నారు. ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యులు రోగుల దగ్గర అధిక డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దేవరకద్ర, చిన్నచింతకుంటలలో ట్రామా కేర్ సెంటర్లు, కౌకుంట్ల మండలానికి 108 అంబులెన్స్, హెల్త్ సెంటర్ మంజూరు చేయాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా వైద్యాధికారులు, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కతలప్ప, దేవస్థాన చైర్మన్ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అంజీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి పనులు అక్కడే

- పెండింగ్‌లో చిన్నోనిపల్లి రిజర్వాయర్ నిర్మాణం
- ఎన్నికల ముందు హడావిడిగా పనులు ప్రారంభం
- గ్రామాన్ని ఖాళీ చేయించిన అధికారులు
- పునరావాస కేంద్రంలో వసతులు లేక అవస్థలు

5



అసంపూర్తిగా ఉన్న రిజర్వాయర్ మట్టికట్ట

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

- ప్రేమ జంటకు సహకరించావంటూ మందలించిన పెద్దలు
- మనస్తాపంతో బలవన్మరణం

5



సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్

నేడు పీయూకు న్యాక్ బృందం రాక

- సర్వం సిద్ధం చేశాం: వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీకి న్యాక్ బృందం సందర్శన సందర్భంగా సర్వం సిద్ధం చేశామని పీయూ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పీయూ పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. న్యాక్ నుంచి ఆరుగురు వస్తున్నారని, బృందాలుగా ఏర్పడి యూనివర్సిటీలో వనపర్తి, గద్వాల, కొల్లాపూర్‌లో యూనివర్సిటీ పీజీ కేంద్రాల వసతులను పరిశీలిస్తారని తెలిపారు. అకాడమిక్ పనితీరు, వసతులు, హాస్టల్, అల్మని విధానం, కరికులుం, స్పోర్ట్స్, హెల్త్, గ్రౌండ్, విద్యార్థులకు అందిస్తున్న అన్ని రకాల వసతులను పరిశీలిస్తారని చెప్పారు. అధికారులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది కష్టపడి పని చేశారని అన్నారు. 2018లో న్యాక్ బీ గ్రేడ్ ఇచ్చిందని, రూ.100కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈసారి యూనివర్సిటీలో వసతులు, మెరుగైన విద్య, ఎక్కువ అర్హతలు గల అధ్యాపకులు ఉన్నట్లు తెలిపారు. ఈసారి తప్పకుండా మంచి గ్రేడ్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

హైవే.. కనవే



కొత్తూరు నుంచి దివిటిపల్లి బ్రిడ్జిపై రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాలు

(3వ పేజీ తరువాయి)

చేశారు. 26 ట్యాంకులకు గాను పది ట్యాంకులకు నల్లాలు బిగించ లేదు. 18 ఎస్‌వోఎస్ ఫోనులు ఉండగా, రెండు మాత్రమే పని చేస్తున్నాయి. ఆరు జంక్షన్లు, రెండు యూటర్న్‌లు, మూడు ఫ్లైఓవర్ బ్రిడ్జీలు ఉన్నాయి. ముమ్మళపల్లి ఫ్లైఓవర్‌కు ఒక వైపున సర్వీస్ రోడ్డు 20 ఏళ్లుగా నిర్మాణంలోనే ఉంది. కొత్తకోట బైపాస్‌కు ఇరువైపుల సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు.

జడ్చర్ల వద్ద ప్రమాదకరంగా వాహనాల పార్కింగ్

జడ్చర్ల పరిధిలో బస్టాండ్ల వద్ద నిర్మించిన నీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. వాటికి అమర్చిన కుళాయిలు విరిగిపోయాయి. వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జడ్చర్ల కొత్తబస్టాండు సమీపంలో కర్నూల్‌వైపు వెళ్లే దారిలో ఫ్లైఓవర్ చివరన రోడ్డుపైనే వాహనాలను ప్రమాదభరితంగా పార్కింగ్ చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఇప్పటికే ఎంతో మృత్యువాతపడ్డారు. జాతీయ రహదారిపై ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, అత్యవసర సమయంలో సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన ఎస్‌ఓఎస్ ఫోన్లు పని చేయడం లేదు. జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న హోటల్స్, దాబాల వద్ద వాహనాలను రోడ్డు ప్రక్కనే నిలిపేయడంతో ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతోంది. జడ్చర్ల మండలం గొల్లపల్లి, బురెడ్డిపల్లి, మల్లెబోయిన్‌పల్లి కూడళ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రహదారిపై కొన్ని చోట్ల మధ్యాహ్నం టెంట్లు వేసి భోజనాలు అమ్ముతుండటంతో అక్కడ వాహనాలు నిలపడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడా టాయిలెట్స్ లేకపోవడంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

వసతులు కరువు

పెబ్బేరు మండలంలో జాతీయ రహదారి 11 కిలో మీటర్ల మేర ఉంది. 10 ఎస్‌వోఎస్ ఫోన్లు ఉండగా ఒక్కటీ పని చేయడం లేదు. నాలుగింటికి సిగ్నల్ వైర్లు కట్ చేశారు. రోడ్డు వెంట ఒక్క పోలీస్ పెట్రోలింగ్ వాహనం కూడా తిరుగలేదు. ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలను తీసుకెళ్లే వాహనాలు మూడు ఉన్నాయి. ఆరు బస్టాండ్లు ఉండగా, అన్నీ అపరిశుభ్రంగా మారాయి. తాగు నీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. రెండు మరుగుదొడ్లు ఉన్నాయి. రోడ్డు వెంట జూరాల క్వాల పక్కన మూడు చోట్ల దాబాలు ఉన్నాయి. అక్కడ రోడ్డుపై వాహనాలను నిలుపుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగు చోట్ల ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పెబ్బేరు బైపాస్ వద్ద రోడ్డు క్రాస్‌గా ఉండటం, వాహనాలు వేగంగా వెళ్లడం వల్ల కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. లిక్కర్ ఫ్యాక్టరీ దగ్గర ఉన్న కూడలిని దాటుతున్న సమయంలో ఎదురుగా చెట్లు ఉండటంతో వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రంగాపూర్ బైపాస్ వద్ద బోర్డుపై ఊర్ల పేర్లు కనిపించడం లేదు. రాంపురం గ్రామానికి వెళ్లే దగ్గర బస్ షెల్టర్ అసంపూర్తిగా ఉంది.



జానంపేట వద్ద పనిచేయని హైమాస్ట్ లైట్లు

తగ్గిన ప్రమాదాలు

జాతీయ రహదారిపై అతివేగంగా వెళ్లే వాహనదారుల వల్ల గతంలో అధికంగా ప్రమాదాలు జరిగేవి. ఏటా ప్రమాదాలు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని నిర్వహణ సంస్థ చెబుతోంది. 2022లో కొత్తకోట నుంచి కర్నూలు కృష్ణనగర్ వరకు 559 ప్రమాదాలు జరిగాయి. 2023లో 560 ప్రమాదాలు జరుగగా 2024 వచ్చేసరికి 400 ప్రమాదాలు జరిగినట్లు హైవే అధికారులు తెలిపారు.

నిరుపయోగంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు

అడ్డాకుల మండలం శాఖాపూర్ ఎల్‌అండ్‌టీ టోల్‌ప్లాజా పరిధిలో భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మండలాల్లో 56 ఎస్‌వోఎస్ బాక్స్‌లు ఉండగా ఎక్కడా పని చేయడం లేదు. మూత్రశాలలు, మరుగుదోడ్లు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొమిరెడ్డిపల్లి ట్రాక్ పార్కింగ్ జోన్ వద్ద పాత బీటీ రోడ్డుపై లైట్లు లేవు. టోల్‌ప్లాజా దగ్గర రెండు చోట్ల మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయి. వాటి నిర్వహణ లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. దాంతో డ్రైవర్లు ఆరుబయట మల, మూత్ర విసర్జన చేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. దివిటిపల్లి దగ్గర ఏడాదిన్నర నుంచి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం లేదు. దాంతో ఒక దారిలో వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో అతస్యవసర సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 40 బస్టాప్‌లు ఉండగా చాలావరకు వృథాగా ఉన్నాయి. అక్కడ చెత్త బుట్టలు ఏర్పాటు చేయలేదు. తాగునీరు లేక ట్యాంకులు వృథాగా మారాయి. సౌకర్యాలు లేక అక్కడ ప్రయాణికులు ఉండకపోవడంతో యాచకులు, మతిస్థిమితం లేని వారికి ఇవి నిలయంగా మారాయి. అత్యవసర వేళల్లో క్షతగాత్రుల తరలింపు కోసం రెండు మొబైల్ అత్యవసర వాహనాలు 24 గంటల పాటు అందుబాటులో ఉంచారు. ఏదైనా వాహనం ఆగినా, పడిపోయినా అత్యవసర సర్వీస్‌ను ఉచితంగా అందిస్తున్నారు. 14 చోట్ల బ్లాక్‌స్పాట్‌లను అధికారులు గుర్తించారు. ఐదు చోట్ల వంతెనలు ఉన్నాయి. టోల్‌ప్లాజా పరిధిలోని శేరిపల్లి(బీ), వేములస్టేజీ, జానంపేట, వెల్టూరు, కనిమెట్ట దగ్గర అండర్‌గ్రౌండ్ వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

అధికారులకు తెలియజేశాం: దీప, ఎల్‌అండ్‌టీ టోల్ ప్లాజా మేనేజర్

తమ టోల్‌ప్లాజా పరిధిలో ఉన్న సమస్యలపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు తెలియజేశాం. మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్వహణ చేసే కాంట్రాక్టర్ గడువు అయిపోయింది. పార్కింగ్ జోన్ వద్ద సౌకర్యాలు కల్పించడానికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో సమీక్షిస్తాం. బస్టాప్‌ల దగ్గర ట్యాంకుల్లో వేసవిలో నీరు అందుబాటులో ఉంటోంది. అక్కడక్కడ చెత్త బుట్టలను ఏర్పాటు చేయగా, కొన్నిచోట్ల మతిస్థిమితం లేని వ్యక్తులు విరగోట్టారు.

నీళ్లు లేని ట్యాంకు

ఎర్రవల్లి మండలం ధర్మవరం స్టేజీ నుండి బీచుపల్లి వరకు బస్టాప్‌లు, తాగునీటి ట్యాంకులు వృథాగా ఉన్నాయి ఎర్రవల్లి చౌరస్తా సమీపంలోని ఎస్‌వోఎస్ ఫోన్ పని చేస్తోంది. బస్టాండ్‌లు ప్రధాన కూడళ్లకు కాస్త దూరంగా ఉండటంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రయాణికులు కూడళ్లలోనే నిల్చుని బస్సులు, ఇతర వాహనాల్లో ఎక్కుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాల విక్రయం

అలంపూరు చౌరస్తా: జోగుళాంబ గద్వాల జిల్లా పుల్లూరు టోల్‌ప్లాజా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దులో ఉండటంతో వేలాది వాహనాలు ఈ రోడ్డు వెంట తిరుగుతుంటాయి. వాహనదారులు ఇక్కడ సేదతీరుతుంటారు. ఇక్కడ స్నాక్స్ టీ విక్రయాలు జరుపుకుంటూ, టాయిలెట్స్ నిర్వహణ బాధ్యతలు చూడాలని విజయ డెయిరీ వారికి అప్పగించారు. కానీ కర్నూలు వైపు ఉన్న టాయిలెట్స్‌ను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అవి పూర్తిగా ధ్వసం అయ్యాయి. ఇక హైదరాబాదు వైపు ఉన్న టాయిలెట్స్‌ను ఇటీవల విజయడైరీ విరమించుకోవడంతో నెల పాటు తాళం వేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో హైవే నిర్వహణ సంస్థవారే అందుబాటులోకి తెచ్చారు. టోల్‌గేట్‌కు అటు ఇటు రోడ్లపైనే భారీ వాహనాలు నిలుపుతుండం వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ హోటల్స్, చిరువ్యాపారులు హైవేకు అనుకుని వ్యాపారులు నిర్వహిస్తున్నారు. టోల్‌గేట్ల వద్ద రోడ్డుకు సమీపంలో స్నాక్స్, టీ, వాటర్ మినహా స్టవ్‌తో చేసే ఆహార పదార్థాలు చేయరాదనేది నిబంధన ఉన్నా అమలు కావడం లేదు. ఎస్‌వోఎస్ ఫోన్లు పని చేయడం లేదు. బస్టాప్‌ల వద్ద ట్యాంకులలో నీరు పరిశుభ్రంగా లేదు. కొన్ని చోట్ల నల్లాలు బిగించలేదు. చిన్న చిన్న ప్రమాదాలు జరిగితే వెంటనే వాహనాలను అక్కడి నుంచి తొలగించడం లేదని వాహనదారులు తెలిపారు.

ప్రమాదాల నివారణ చేపడతాం : ఏపీ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్ట్ మెనేజర్ ఎస్‌జేవీ ప్రసాదరావు

జాతీయ రహదారిపై అత్యాధునిక పద్ధతిలో మార్పులు చేర్పులు చేస్తున్నాం. ప్రయాణికులకు సౌకర్యాలు పెంచుతూ, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ మలుపు వద్ద బ్లింకర్స్, 74 కిలో మీటర్ల పొడవున రెడ్ సిగ్నల్ స్టడ్స్ ఏర్పాటు చేశాం. బస్టాప్‌ల వద్ద నల్లాలు ఏర్పాటు చేస్తున్నా, ఆకతాయిలు వాటిని తీసుకెళ్లడమో, విరగొట్టడమో చేస్తున్నారు. ట్యాంకులలో రోజూ వాటర్ నింపుతున్నాం. ఎక్కడ లేని విధంగా రోడ్డు మధ్యలో గ్రీనరీ నాటాం.



అడ్డాకుల టోల్‌గేట్ వద్ద నిలిపిన వాహనాలు



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాదు వైపు రోడ్డుపైనే నిలిపిన వాహనాలు



పెబ్బేరు మండలం రాంపురం గ్రామానికి వెళ్లే దారిలో నిరుయోగంగా ఉన్న బస్ షెల్టర్



పెబ్బేరు మండలం తోమాలపల్లిలోని నీటి ట్యాంకులో పేరుకున్న చెత్తా చెదారం



బాలానగర్ మండలం పెద్దాయిపల్లి దగ్గర ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనాలు

అధిక దిగుబడితోనే ఆదాయం

- కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ టి.ప్రభాకర్ రెడ్డి



ఖానాపూర్‌లో రైతులకు కందిసాగుపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తల బృందం

బిజినేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కంది సాగులో రైతులు అధిక దిగుబడి సాధిస్తేనే మంచి ఆదాయం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ టీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్‌లో బుధవారం కందిలో సామూహిక క్షేత్ర దినోత్సవం నిర్వహించి రైతులు సాగుచేసిన కంది పంటను పరిశీలించారు. ప్రతీ ఏటా జాతీయ ఆహార భద్రత సంస్థ ఆర్థిక సహాయం తో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించి పప్పు దినుసుల సాగును ప్రోత్సహించినట్లు తెలిపారు. అంతేకాకుండా అవసరమైన పురుగుల మందులు, సస్యరక్షణ చర్యలు, సరైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి అధిక దిగుబడి పొందేలా అవగాహన కల్పించినట్లు తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శైల, డాక్టర్ ఆదిశంకర్, డాక్టర్ బీ రాజశేఖర్, డాక్టర్ రామకృష్ణ, ఏఈవో శారద, రైతులు శరవంద, ఆంజనేయులు, శేఖర్, బొనమోని నరసింహ, అర్జున్, కొండయ్య తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

- ఏడు పదుల వయస్సులో కేరింతలు



54 ఏళ్ల తరువాత కలుసుకున్న 1970-71 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

బిజినేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వారందరికీ ఏడు పదుల వయస్సు దాటింది. ముదిమి వయస్సులో మనువండ్లు, మనువరాళ్లతో కాలక్షేపం చేసుకుంటూ ఇంటి పట్టునే ఉంటున్నారు. చేతిలో కర్ర, కళ్లకు అద్దాలతో చిన్ననాటి మిత్రులను కలువగానే ఏడు పదుల వయస్సులో ఆనందంతో కేరింతలు వేస్తూ చిన్నపిల్లల్లా మారిపోయారు. బిజినేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 54 ఏళ్ల క్రితం పదవ తరగతి చదివిన 1970-71 విద్యా సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక బుధవారం పూర్వ విద్యార్థి సుహాసిని నివాసంలో ఆద్యంతం ఆనంద బాష్పాలతో సాగింది. మొత్తం 18 మంది పూర్వ విద్యార్థుల్లో నలుగురు మృతి చెందడంతో వారికి నివాళి అర్పించారు. సమ్మేళనానికి వచ్చిన వారందరికీ ఒకరినొకరు శాలువాలతో సత్కరించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుప్పిరెడ్డి తిరుపతిరెడ్డి, సి.పురుషోత్తం, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రంగనాథం, శేషాచార్యులు, రమాదేవి, వేదవతి, సుభాషిణి తదితరులు ఉన్నారు.

'ఆత్మీయ భరోసా'కు అడ్డంకులు

గద్వాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారెంటీలలో భాగంగా భూమిలేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలను అందించడానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకాన్ని ఈ నెల 26వ తేది నుంచి అమలు చేయడానికి సిద్ధమయ్యారు. కాని, ఈ పథకానికి అర్హత ఉండాలంటే భూమిలేని నిరుపేద కూలీలు 2023-24 ఆర్థిక సంవత్సంలో కనీసం 20 రోజులు ఉపాధి పనులు చేసి ఉండాలి. అయితే చాలా గ్రామాలలో ఉపాధి పనులు నిర్వహించకపోవడం, ఫీల్డ్ అసిస్టెంట్లు పని కల్పించకపోవడం, పని కల్పించినా ఒకే గ్రూపు, వర్గం వారు వచ్చే విధంగా పనులు నిర్వహించడంతో చాలా మంది ఉపాధి హామీ పనులకు దూరమయ్యారు. మరికొందరు అప్పుడప్పుడు మాత్రమే వెళ్లారు. నిరుపేదలు కావడంతో కుటుంబ పోషణ కోసం ఇతర వ్యవసాయ కూలీ పనులు చేసుకున్నారు. వివిధ కారణాలతో భూమిలేని రైతులు ఉపాధి హామీలో 20రోజుల పని దినాల చేయలేకపోయారు. దీంతో అధికారులు వారిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అనర్హులుగా ప్రకటిస్తున్నారు. దీంతో గ్రామ సభల్లో అధికారులను నిలదీస్తున్నారు.

మండలాల వారిగా అర్హత సాధించిన వారు

మండలం	జాబ్ కార్డులు	20రోజులు పూర్తైనవారు	అర్హత పొందిన వారు
అయిజ	17,474	3,883	911
ఆలంపూర్	9,194	1,780	740
ధరూర్	16,134	5,323	1,606
గద్వాల	12,926	4,345	1,088
గట్టు	17,659	3,321	754
ఇటిక్యాల	17,042	3,974	1,021
కేటీదొడ్డి	11,726	3,128	774
మల్దకల్	18,355	3,570	781
మానవపాడు	9,973	2,024	614
రాజోలి	9,727	2,238	633
ఉండవెల్లి	9,926	2,818	1,111
వడ్డేపల్లి	6,446	1,481	360
మొత్తం	1,56,582	37,885	10,393

జిల్లాలో అర్హత సాధించింది 10,393 మంది మాత్రమే..

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హత సాధించిన కూలీలు 10,393మంది మాత్రమే.. వాస్తవంగా జిల్లాలో 1,56,582 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో ఉపాధి పనికి వచ్చే జాబ్‌కార్డు హోలర్లు 88,298మంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20రోజులు పనికి వచ్చిన జాబ్ కార్డుహోల్డర్లు 37,885 మంది. ఇందులో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హత సాధించింది 10,393 మంది మాత్రమే ఉన్నారు. కూలీల ఆధార్, బ్యాంకు ఖాతాలను ధరణి పోర్టల్‌లో మ్యాచ్ చేసి చూడగా కేవలం 10,393 మందికి మాత్రమే భూమి లేదని తేలింది.

వ్యవసాయ పనులు జోరుగా సాగడంతో..

ఈ ఏడాది జిల్లా వ్యయసాయ పనులు జోరుగా సాగడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. చాలా మంది ఉపాధి పనులకు బదులుగా వ్యవసాయ పనులకు వెళ్లారు. దీంతో భూమి లేని నిరుపేదలు చాలా మంది 20 రోజుల పనిదినాలు చేయలేకపోవడంతో ఆత్మీయ భరోసా పథకానికి అనర్హులయ్యారు. కాని, తమకు భూమి లేదు ఎందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వరు అంటూ అధికారులను నిలదీస్తున్నారు. 20 రోజుల నిబంధనతో సంబంధం లేకుండా భూమి లేని నిరుపేదలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నాపేరు జాబితాలో రాలేదు



సెంటు భూమి లేదు. కూలీ పనిచేసుకొని బతుకుతున్నాం. నా భర్త కూడా పనిచేయడు. కుటుంబ పోషణ నామీదనే ఆధారపడి ఉంది. పని కల్పించినప్పుడు ఉపాధి పనికి వెళ్లాను. మిగిలిన సమయంలో వ్యవసాయ కూలీ పనిచేసుకున్నా. దరఖాస్తు చేసుకుందామంటే జాబ్‌కార్డు ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద ఉంది.

- జయమ్మ, ఉపాధి కూలి, చెనుగోనిపల్లి

20 రోజులు పని కల్పించలేదు



నేను ఉపాధి పనిచేశాను. ఎప్పుడో ఒకసారి మాత్రమే పని కల్పించారు. దీంతో మేము వ్యవసాయ కూలీ పనులకు వెళ్లాము. ఇప్పుడు 20రోజులు పనిచేయలేదు అంటున్నారు. మాకు సెంటు భూమి లేదు. మాకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలి.

- సరస్వతి, ఉపాధి కూలీ, చెనుగోనిపల్లి

గ్రామసభలో గందరగోళం

- అనర్హుల పేర్లను తొలగించాలని ఆందోళన



అమరచింత గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న వివిధ పార్టీల నాయకులు, ప్రజలు

అమరచింత, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం అమరచింతలో ఏర్పాటు చేసిన గ్రామసభలో గందరగోళం నెలకొన్నది. పట్టణంలోని ఐదో వార్డులో వార్డు స్పెషల్ అధికారులు మునిస్వామి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన వారి పేర్లను చదివి వినిపించారు. దీంతో గ్రామసభకు వచ్చిన వివిధ పార్టీల నాయకులు, కాలనీ ప్రజలు మీరు చదివిన లిస్టులో తప్పులు ఉన్నాయని అధికారులతో వాదనకు దిగారు. దీంతో గ్రామసభ గందరగోళం మధ్య సాగింది. వామపక్ష పార్టీలతో పాటు 5వ వార్డుకు సంబంధించిన మహిళలు, లబ్ధిదారులు అర్హులు లేని లిస్టును రద్దు చేసి మళ్లీ ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. గందరగోళం మధ్యనే ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. కొంతమంది సంతకాలు చేయగా బీఆర్ఎస్ కౌన్సిలర్, మరికొంత మంది సంతకం చేయకుండానే వెళ్లిపోయారు. ఎనిమిదో వార్డు సభలో గందరగోళం నెలకొంది. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులను ఎంపిక చేయలేదన్న విమర్శలు వస్తున్నాయి.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, పోలీసులు ప్లకార్డులు పట్టుకుని పోలీస్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌక్ వద్ద నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను 2025 జనవరి ఒకటి నుంచి 31వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత అనేది అందరి బాధ్యత, రోడ్డుపై జాగ్రత్తగా ఉండాలని, ప్రమాదాలను నివారించాలని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించే దిశగా అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం రహదారి భద్రతకు సంబంధించి పోస్టర్‌ను కలెక్టర్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా బ్లూకోర్ట్స్‌కు హెల్మెట్లను అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్, ఆర్డీవో బాలు, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్టీసీ డిపో మేనేజర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నలభై లక్షల కొత్త రేషన్ కార్డులు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నలభై లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని జయన్న తిరుమలాపూర్‌లో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. సంక్షేమ పథకాల కోసం తొందర అవసరం లేదని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరంతరంగా కొనసాగుతోందిన తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ భరోసా మెదలైన పథకాలు పేదల కోసం ప్రవేశపెట్టినవే అన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తామని భరోసా ఇచ్చారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం, ఒక్కొక్కరికీ ఆరు కేజీల సన్న బియ్యం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిలక్ కుమార్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి గోంవిదనాయక్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నారం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బల్మూరు మండలం చెన్నారం పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామసభకు గైర్హాజరు కావడంతో పాటు ఇతర విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఆపరేషన్ స్మైల్

- బడి మానేసిన 20 మంది బడిలోకి
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆపరేషన్ స్మైల్ కొనసాగుతోందని ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ దుకాణాలు, హోటళ్లు, వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించడంతో పాటు డ్రాప్ అవుట్ అయిన వారిని బడిలో చేర్పిస్తున్నామని తెలిపారు. మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామంలో 10వ తరగతి డ్రాప్ అవుట్ అయిన 21 మంది విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి 20 మంది విద్యార్థులను బుధవారం బడిలో చేర్పించామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు ఉంటే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

ఆడపిల్లలు సమాజానికి మణిహారాలు

» వనపర్తి జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

వనపర్తి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలు సమాజానికి మణిహారాలని, వారికి రక్షణ కల్పించి, బంగారు భవిష్యత్తుకు పునాది వేద్దామని జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి అన్నారు. బేటీ బచావో - బేటీ పడావో పథకం ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులతో కలిసి నాగవరం నుంచి వివేకానంద చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ ఆడపిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని, వారి అభివృద్ధికి అందరూ తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్, జండర్ స్పెషలిస్టులు శ్రీవాణి, సలోమి, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధరలు

» క్వింటాలు ధర గరిష్ఠం రూ. 4,020, కనిష్ఠం రూ. 3,000



మార్కెట్లో కొనసాగుతున్న ఉల్లి విక్రయాలు

దేవరకద్ర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉల్లి ధరలు గతం కంటే స్వల్పంగా స్వల్పంగా పెరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండల కేంద్రంలోని మార్కెట్లో బుధవారం 56 క్వింటాల ఉల్లి విక్రయానికి వచ్చింది. వ్యాపారులు నిర్వహించిన వేలంలో క్వింటాలు ధర గరిష్ఠంగా రూ 4,020, కనిష్ఠంగా రూ. 3,000 ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జయశ్రీ తెలిపారు. గత వారం కంటే ఐదు వందల రూపాయలు ధర పెరిగినట్లు చెప్పారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న తెల్ల ఉల్లిగడ్డకు అధిక ధర లభించింది. ఎర్రఉల్లిని ఎక్కువగా చిరు వ్యాపారులు కొనుగోలు చేశారు.

రేపటి నుంచి అంతర్ జిల్లా గేమ్స్‌మీట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో అంతర్ జిల్లా స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.మోహన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

క్రైం కార్నర్

పశుగ్రాసం, యంత్రాలు దగ్ధం

» రూ .10 లక్షల ఆస్తి నష్టం



కాలి బూడిదైన పశుగ్రాసం, యంత్రాలు

కొత్తపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పశుగ్రాసం, దాణా తయారు చేసే యంత్రాలు దగ్ధమై రూ. 10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండల పరిధిలోని భూనీడు తండా (బోజ్యానాయక్ తండా) సమీపంలో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. బాధితుడు రవినాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వివిధ గ్రామాల రైతుల నుంచి గ్రాసాన్ని కొనుగోలు చేసి, దాణాగా మార్చి హైదరాబాద్‌కు తరలించేందుకు నిల్వ ఉంచారు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో గ్రాసానికి మంటలు అంటుకున్నాయి. దీంతో 120 ట్రిప్పుల చొప్పతో పాటు రెండు యంత్రాలు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ. 10 లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. రవినాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు మద్దూరు ఎస్ఐ రాంలాల్ తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

» 60 కిలోల నల్లబెల్లం స్వాధీనం

కోడేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల పరిధిలోని సారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి నల్లబెల్లం, సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ బి.నాగిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓపీ తండాలో 60 కేజీల నల్ల బెల్లం, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 400 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. గుండ్యా వాల్యానాయక్ తండాలో అయిదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. సింగయ్యపల్లి తండాకు చెందిన ఇద్దరిపై బైండోవర్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి డి.గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో కొల్లాపూర్ సీఐ నాగిరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, గద్వాల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సైదిరెడ్డి, ఎస్ఐలు హనుమంతు, మురళి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయురాలి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేటు ఉపాధ్యాయురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగింది. ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన బాలరాణి(37)కి గత సంవత్సరం అదే నగరానికి చెందిన వెంకటరెడ్డితో వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో బాలరాణి మూడు నెలల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చేరుకున్నది. అక్కడి ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ జీవనం గడుపుతోంది. తోటి టీచర్లతో కలిసి ఒక గదిలో నివసిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో తోటి ఉపాధ్యాయినులు ఇంటికెళ్లి చూడగా కిటికీకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించింది. ఈ సంఘటనపై మృతురాలి బంధువులకు సమాచారం అందించగా, ఆమె తండ్రి నర్సింగ్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్కడి పనులు అక్కడే

» పెండింగ్‌లో చిన్నోనిపల్లి రిజర్వాయర్ నిర్మాణం » ఎన్నికల ముందు హడావిడిగా పనులు
» గ్రామాన్ని ఖాళీ చేయించిన అధికారులు » పునరావాస కేంద్రంలో వసతులు కరువు



పునరావాస కేంద్రంలోని షెడ్డులో కొనసాగుతున్న పాఠశాల

గట్టు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలంలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు ఎక్కడి అక్కడే నిలిచిపోయాయి. పునరావాస కేంద్రంలోనూ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో నిర్వాసితులకు ఇబ్బందులు తప్పడం లేదు. జలయజ్ఞంలో భాగంగా 2005లో అప్పటి ప్రభుత్వం ఈ రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కానీ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ 2009లో మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. కొందరు స్థానిక నాయకులతో వివాదమే అందుకు కారణమన్న ఆరోపణలున్నాయి. ఆ తర్వాత రిజర్వాయర్ నిర్మాణ పనులను ఎవరూ పట్టించుకోలేదు. దాదాపు 14 ఏళ్ల తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్ పనులను చేపట్టేందుకు సిద్ధమైంది. ఆందోళనలు, నిరసనల మధ్యే అధికారులు చిన్నోనిపల్లిని ఖాళీ చేయించి, గ్రామస్థులను పునరావాస కేంద్రానికి తరలించారు. 2023, మార్చి 18న పోలీసు బందోబస్తు మధ్య పనులను ప్రారంభించారు. కొద్ది రోజులు పనులు కొనసాగాయి. ఆ తర్వాత శాసనసభ ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. నూతన ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచింది. కానీ ఇప్పటివరకు రిజర్వాయర్ నిర్మాణంపై దృష్టి సారించలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రిజర్వాయర్ మట్టికట్ట పెంపు, రివిట్‌మెంట్, తూము, అలుగు కాలువల పనులు పూర్తి చేయాల్సి ఉంది.

సమస్యలతో సహజీవనం

రిజర్వాయర్ నిర్మాణం కోసం ఊరును వదిలేసి, పునరావాస కేంద్రానికి చేరుకున్న గ్రామస్థులు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. ప్రధానంగా పాఠశాల భవనం లేకపోవడంతో షెడ్డులో కొనసాగిస్తున్నారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంగన్‌వాడీ భవనం లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు. మిషన్‌భగీరథ నీరు రావడం లేదు. 50 కుటుంబాలకు పైగా షిఫ్టింగ్ చార్జీలు ఇవ్వలేదు. ఊరును ఖాళీ చేసేందుకు గ్రామస్థులకు తక్షణ సహాయం కింద ఇవ్వాల్సిన రూ.16,500 ఇంకా చాలా మందికి చెల్లించలేదు. ప్లాట్ల పంపిణీలో జరిగిన తప్పిదాలతో స్థానికుల మధ్య వివాదాలు తలెత్తి పోలీస్‌స్టేషన్‌కు చేరిన సందర్భాలున్నాయి. అలాగే పునరావాస కేంద్రంలో ఖాళీ ప్లాట్లను కొందరు కబ్జా చేస్తుండటం సమస్యగా మారింది. పాత గ్రామంలో ముంపు సమస్య, పునరావాసంలో సౌకర్యాల కొరతతో నిర్వాసితులు సతమతం అవుతున్నారు.

పనులు ఎందుకు చేపట్టడం లేదు



పనులకు అడ్డుకుంటున్నారంటూ మాతో ఊరు ఖాళీ చేయించి, పునరావాస కేంద్రానికి తరలించారు. మేము గ్రామాన్ని వదిలేసి నాలుగు నెలలు అవుతోంది. ఇప్పుడు పనులు చేపట్టడానికి అడ్డంకులు లేవు. అయినా పనులు ఎందుకు చేపట్టడం లేదో అధికారులు, నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలి. పునరావాస కేంద్రంలో సౌకర్యాలు లేక ఇతర గ్రామాల్లో ఉండాల్సి వస్తోంది.

\- నర్సింహులుగౌడు, గ్రామస్థుడు

పునరావాసంలో ఇబ్బందులు



పునరావాస కేంద్రంలో సౌకర్యాలు లేక ఇబ్బంది పడ్తున్నాం. గ్రామాన్ని ఖాళీ చేసేందుకు ఇవ్వాల్సిన షిఫ్టింగ్ చార్జీలను ఇప్పటివరకు ఇవ్వలేదు. తక్షణ సాయం కూడా చాలా మందికి అందలేదు. గ్రామాన్ని ఖాళీ చేయించిన అధికా రులు, రిజర్వాయర్ పనులను మాత్రం చేపట్టడం లేదు. అధికారులు స్పందించి పునరావాస కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి.

\- రాఘవేంద్రనాయుడు, గ్రామస్థుడు

పనులు ప్రారంభించేందుకు చర్యలు



చిన్నోనిపల్లి రాజర్వాయర్ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. బండ్, మట్టి కట్ట పెంపు పనులు, రివిట్‌మెంట్, తూము, అలుగు నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చుట్టూ పంట పొలాలు ఉన్నందున మట్టి తవ్వేందుకు ఇబ్బంది కలుగుతోంది. ఈ సంవత్సరం పనులు చేపట్టి, పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

\- రైముద్దీన్, ఎస్ఈ, నీటిపారుదల శాఖ



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణం



రిజర్వాయర్ రద్దు కోసం ఆందోళన చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

విజేతలుగా తిరిగి రావాలి

» జీఎఫ్ఏ జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు

గద్వాల అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారిణులు విజేతలై తిరిగి రావాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జోగుళాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్‌లో ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ అండర్-15 లీగ్ కమ్ నాకౌట్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారిణులు పాల్గొంటున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో మంచి ఆటతీరును కనబరచి జిల్లాకు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు మంచి పేరు తేవాలని కోరారు. అలాగే లక్ష్య అకాడమీ ఫుట్‌బాల్ జట్టుకు గద్వాలకు చెందిన కరిష్మాను కోచ్‌గా ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి విజయకుమార్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

సహకార సంఘాల పనితీరు భేష్

» కేరళలో డీసీసీబీ ప్రతినిధి బృందం పర్యటన



వ్యవసాయ సహకార సంఘాల పనితీరును వివరిస్తున్న అక్కడి బ్యాంకు సిబ్బంది

పాలమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్రంలో వ్యవసాయ సహకార సంఘాల పని తీరు అద్భుతంగా ఉందని డీసీసీబీ విజ్ఞానయాత్ర ప్రతినిధి బృందం సభ్యులు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని డీసీసీబీ పాలకవర్గం, ఉమ్మడి జిల్లాలోని సింగిల్‌విండో చైర్మన్లు బుధవారం కేరళ రాష్ట్రంలోని సహకార సంఘాలను పరిశీలించారు. నడుంకందం సహకార సంఘం అధ్యక్షుడు సింధు ప్రకాష్, డైరెక్టర్ జాన్సన్, విద్దు బ్యాంకు సిబ్బంది తమ బ్యాంకు పురోగతిని బృందానికి వివరించారు. తమ సొసైటీకి 30 వేల మంది సభ్యులతో 11 బ్రాంచులలో కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. ప్రధానంగా అల్లం, మిరియాలు, కొబ్బరి, రబ్బరు తదితరాల సాగుకు రైతుల పొలాన్ని మార్ట్‌గేజ్ చేసుకుంటామని తెలిపారు. మార్కెట్ విలువలో 40 శాతాన్ని రైతులకు ఓవర్‌డ్రాఫ్ట్, క్యాష్ క్రెడిట్ ద్వారా ఇస్తామని చెప్పారు. రూ.50 వేల వరకు పంట రుణాలను సొంత పూచికత్తుపై అందిస్తామన్నారు. ఆపైన అవసరమైతే మార్ట్‌గేజ్ చేస్తూ, రుణం పొందవచ్చని బృందానికి వివరించారు. తెలంగాణ మాదిరి మూడంచెల సహకార వ్యవస్థ కాకుండా, కేరళలో రెండు అంచెల విధానం అమలులో ఉందన్నారు. గతంలో 40 జిల్లా స్థాయి బ్యాంకులు ఉండగా, వాటిలో చాలా వాటిని ప్రభుత్వం విలీనం చేసుకుందని వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య, డైరెక్టర్ రంగారెడ్డి, భూపాల్‌రావు, వెంకటేష్ గుప్తా, వంశీచందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాయక్, నరసింహులు, బ్యాంక్ ఏజీఎం దయాకర్‌రెడ్డి, మేనేజర్ సత్యప్రకాష్, పీఏసీఎస్ సంఘం అధ్యక్షులు పోతుల మధు సూదన్, పాలెం సుదర్శన్‌గౌడ్, ఉమ్మడి జిల్లాలోని 60 మంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

లంబాడీ సామాజిక వర్గానికి
మంత్రి పదవి ఇవ్వాలి

» మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : లంబాడీ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నిరాహార దీక్షకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజు జయంతిని ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలన్నారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాల, బాలికల వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ప్రతీ తండాను రెవెన్యూ గ్రామంగా మార్చాలన్నారు. నిరాహార దీక్షలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్‌నాయక్, సంజీవ్ నాయక్, లక్ష్మణ్ నాయక్, కిషన్ పవార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. .

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



సాయి

» ప్రేమ జంటకు సహకరించావంటూ మందలించిన పెద్దలు » మనస్తాపంతో బలవన్మరణం

తాడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ జంట వెళ్లిపోయేందుకు సహకరించావంటూ పెద్దలు మందలించడంతో ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని చెర్లటిక్యాల గ్రామంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఏఎస్ఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఓ ప్రేమ జంట ఈనెల 20న వెళ్లిపోయింది. అందుకు సహకరించావంటూ గ్రామానికి చెందిన సాయి (22)ని యువతి తరపు పెద్దలు 21వ తేదీన మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సాయి బుధవారం తెల్లవారుజామున ట్రాక్టర్ నడుపుకుంటూ పొలం దగ్గరకు వెళ్లాడు. అక్కడున్న చెట్టుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై అతడి తండ్రి అంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నారాయణపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రం శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. నారాయణపేట సుబాష్‌రోడ్ ప్రాంతానికి చెందిన గజ్జల రాకేశ్ (23) మద్దూరు నుంచి జిల్లా కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, దామరగిద్ద వైపు వెళ్తున్న బొలెరో ఢీకొట్టింది. ప్రమాదంలో రాకేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తూ, కుటుంబానికి ఆసరాగా ఉన్న రాకేశ్ మృతితో తండ్రి వెంకటప్ప, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

నడి ఊరిలో భారీ మొసలి

» ఆందోళనకు గురైన

అయ్యవారిపల్లి గ్రామస్థులు



మొసలిని బంధించి తీసుకెళ్తున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు

పెబ్బేరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఊరి మధ్య నున్న ఓ ఇంటి ముందు భారీ మొసలి కన్పించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలం, అయ్యవారిపల్లిలో ఈ సంఘటన జరిగింది. బుధవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన బీచుపల్లి ఇంటి ముందున్న కట్టెల కుప్ప వద్ద ఏదో అలికిడి వినిపించింది. అతడు ఇంట్లో నుంచి బయటకు వచ్చి పరిశీలిస్తే ఏమీ కనిపించలేదు. దీంతో లోనికి వెళ్లి పడుకున్నారు. ఉదయం ఇంట్లో నుంచి బయటకు వచ్చే సరికి భారీ మొసలి కనిపించడంతో తీవ్ర ఆందోళనకు గురై చుట్టుపక్కల వారిని పిలిచాడు. వెంటనే పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకొని మొసలిని బంధించారు. అది పది ఫీట్ల పొడవు, 230 కిలోల బరువు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఫారెస్టు సెక్షన్ అధికారి రాణి, సిబ్బందితో పాటు, స్నేక్ సొసైటీ నిర్వాహకుడు చీర్ల కృష్ణసాగర్ మొసలిని వాహనంలో తీసుకెళ్లి కృష్ణానదిలో వదిలేశారు.

న్యూస్ బాక్స్

వర్గీకరణపై కోర్టు తీర్పును అమలు చేయాలి

పాలమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని టీపీఎఫ్ కన్వీనర్ పి.బుచ్చారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏళ్లనుంచి వర్గీకరణ కోసం ఉద్యమాలు చేస్తున్న ఎస్సీలకు న్యాయం చేయకపోవటం సరికాదని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పాలకులను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు.

'ప్రజా ప్రభుత్వంలో అందరికీ మేలు'

నవాబ్‌పేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో అందరికీ మేలు కలుగుతుందని కాంగ్రెస్ నాయకుడు జనుంపల్లి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కాకార్లాలతండా మాజీ సర్పంచ్ భర్త శ్రీనునాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, మార్కెట్ చైర్మన్ హరిలింగం, వెంకటేష్‌గౌడ్, వాసుయాదవ్, అంబదాసు, రఘువీర్‌శర్మ, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టిజన్ల దీక్ష

పాలమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టిజన్స్‌ను క్రమబద్ధీకరించాలని చేయాలని చేపట్టిన రిలే నిరాహారదీక్ష బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్హతను బట్టి సమానమైన పోస్టులోకి కన్వర్షన్ చేయాలని కోరారు. దీక్షలో పద్మ, రాధిక ఆప్టే, సాధిక్, రాములు, శ్రీనివాసులు కూర్చున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు

జడ్చర్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుకన్య బుధవారం ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 11గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ప్రణాళిక, ప్రాముఖ్యత అంశంపై వెబినార్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక ప్రణాళిక, ప్రాముఖ్యత అంశంపై జాతీయ స్థాయి వెబినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుకన్య, ఆర్థిక శిక్షకుడు సురేందర్‌కుమార్, నాగలక్ష్మి, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసులు, అధ్యాపకులు సులేమాన్, వెంకటరెడ్డి, శంకర్, వనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా ఒక ప్రకటనలో ప్రభుత్వానికి కోరారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహ పథకాల్లో అవకాశం కల్పించాలని, ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

జడ్చర్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. మండలంలోని గంగాపురం నుంచి అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్ డ్రైవర్, యజమానిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బాలుడి అదృశ్యం హైదరాబాద్‌లో ప్రత్యక్షం

నవాబ్‌పేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మేనత్త ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయటికెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన మండలంలోని లోకిరేవు గ్రామంలో చోటు చేసుకుంది. తండ్రి రాంచంద్రయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గౌతమ్ లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. ఈనెల 19న తన మేనత్త వద్దకు వెళ్తున్నానని భూత్పూర్‌కు బయలు దేరాడు. ఎంతకు తిరిగి రాక పోవడంతో ఆందోళన చెందిన తండ్రి బుధవారం నవాబ్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విక్రం తెలిపారు. కాగా బాలుడు బుధవారం రాత్రి తల్లి లక్ష్మికి ఫోన్ చేశాడు. ఇంట్లో చెప్పకుండా యాదగిరిగుట్టకు వెళ్లి, తిరుగు ప్రయాణంలో డబ్బులు లేకపోవడంతో ఉప్పల్ బస్టాండ్ నిలిచి వేరొకరి ఫోన్ నుంచి తల్లికి సమాచారం ఇచ్చాడు. బంధువులతో కలిసి హైదరాబాద్ వెళ్లి బాలుడిని తీసుకొచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జర్దోషి, కంప్యూటర్, ఏసీ మెకానిక్, మొబైల్ రిపేర్, సీసీ కెమెరా, హౌస్ వైరింగ్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ అందజేస్తామని తెలిపారు. 16వ విడత శిక్షణ కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా, పాత డీఈవో కార్యాలయంలో గల వృత్తి శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదు

- ఏడాదికి 3,500 ఇళ్లు ఇవ్వబోతున్నాం
- వార్డు సభలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- రూ.7.05 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బోయపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, కౌన్సిలర్లు

మహబూబ్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్కటంటే ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల అర్హులను గుర్తించిన అధికార యంత్రాంగం గ్రామసభల ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. బుధవారం మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్‌లతో కలిసి ఆయన పురపాలిక పరిధిలోని 7, 20, 18, 13, 28వ వార్డులలో నిర్వహించిన వార్డు సభలలో పాల్గొన్నారు. దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎమ్మెల్యే స్వీకరించారు. అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం ఈనెల 26 నుంచి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేయబోతుందన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి రేషన్‌కార్డులు మంజూరుచేశారని, ఇంకా ఎవరైనా రానివారుంటే ఈనెల 26 తరువాత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 1,500 మందికి మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్లను ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి 3,500 చొప్పున, వచ్చే నాలుగేళ్లలో 18వేల ఇళ్లను పేదలకు ఇస్తామన్నారు. త్వరలో రేషన్ షాపులు, హాస్టళ్లలో సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ ఘన్సీరాం, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్లు అనంతరెడ్డి, కట్టా రవి కిషన్‌రెడ్డి, లక్ష్మీదేవి, పద్మ, నాయకులు సిరాజ్ ఖాద్రి, కిషన్ నాయక్, వాజిద్, శివశంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మునిసిపాలిటీ పరిధిలో రూ.7.05కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. 16వ వార్డులోని బోయపల్లి, 34వ వార్డు కొత్త చెరువురోడ్, తొమ్మిదవ వార్డులోని పోచమ్మ దేవాలయం, ఆరవ వార్డులోని శ్రీనివాస కాలనీ, ఎనిమిదవ వార్డులోని మెట్టుగడ్డ, 38వ వార్డులోని బాలుర జూనియర్ కళాశాల రోడ్, 39వ వార్డులోని బాయమ్మతోటలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కమ్యూనిటీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కౌన్సిలర్లు మోతీలాల్, కోట్ల నర్సింహ్మా, నరేందర్, పటేల్ ప్రవీణ్‌కుమార్, రమాదేవి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



డిజిటల్ కంటెంట్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, అధికారులు

- జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత మాది, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన బాధ్యత విద్యార్థులదంటూ ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించేందుకు సుమారు రూ.70కోట్ల నిధులు అవసరమని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ ప్రోగ్రాంలో భాగంగా కంపెనీల ప్రతినిధులతో ఈ నెల 28న సమావేశం నిర్వహించి నిధులను సేకరించేందుకు కృషి చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థులందరికీ బూట్లతో పాటు బ్యాగు, వాటర్ బాటిల్‌ను సొంత ఖర్చుతో అందచేస్తానని వెల్లడించారు.

డిజిటల్ కంటెంట్ పుస్తకాల ఆవిష్కరణ

ప్రభుత్వ పాఠశాలలోని ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధమైన డిజిటల్ కంటెంట్ పుస్తకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పుస్తకాలను ఎమ్మార్సీ ద్వారా ప్రతి పాఠశాల విద్యార్థులకు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో మంజులాదేవి, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, ప్రధానోపాధ్యాయులు, నాయకులు నిత్యానందం, బాదిమి రవిశంకర్, అశోక్ యాదవ్, బుక్కవెంకటేశ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం

జడ్చర్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మునిసిపాలిటీలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని ఆయన మాట్లాడారు. జాబితాలో పేర్లు లేకపోవడంతో తమకు రేషన్‌కార్డు రాదేమో అన్న అనుమానం ఉందని, జాబితాలో లేని వారి పేర్లు సైతం గ్రామసభలో నమోదు చేసుకుని జాబితాలో చేర్చాలని అధికారులకు సూచించారు. గతేడాది ముడాకు నియోజకవర్గం నుంచి రూ.30కోట్ల ఆదాయం వచ్చిందని, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అసమర్థత కారణంగా నిధులన్నీ మహబూబ్‌నగర్‌కు వినియోగించారని విమర్శించారు. ముడాకు వచ్చిన ఆదాయాన్ని జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు 30శాతం, మహబూబ్‌నగర్‌కు 40శాతం చొప్పున కేటాయించే విధంగా ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

బాలనగర్: కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చింతకుంటలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయేతర కార్మికులకు భరోసా ఇవ్వాలి

- ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి సీపీఎం నాయకుల వినతి

చిన్నచింతకుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయేతర కార్మికులకు,పీఎఫ్‌లేని వారికి కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వేణుగోపాల్, ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పర్దీపూర్‌లో జరిగిన గ్రామసభలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ కూలీలతో సంబంధం లేకుండా ఎకరాలోపు పొలం ఉన్న రైతులకు కూడా ఆత్మీయ భరోసాను అమలు చేయాలన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేయకుండానే గ్రామ సభలు నిర్వహించటం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం: అడిషనల్ కలెక్టర్

బాలానగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం పని చేస్తుందని అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని తిరుమలగిరి పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల తదితర పథకాలపై అధికారులు గ్రామసభలో పనిచేసిన తీరును ఆయన పరిశీలించారు. నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతోనే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆమోదం మేరకే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టామన్నారు. ప్రస్తుత జాబితాలో పేర్లు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులది వందేళ్ల చరిత్ర: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు బాలనర్సింహా

పాలమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులది వందేళ్ల చరిత్రగల పార్టీ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వాతంత్ర్య పోరాటంలో దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని కమ్యూనిస్టులు ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొని కాన్పూర్, పెషావర్, మీరట్ కుట్ర కేసులతో జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య పోరాటంతో సంబంధంలేని వ్యక్తులు హిందుత్వ ఎజెండాతో దేశంలో మత రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమ అధికారాన్ని రాష్ట్రాలకు విస్తరించాలని కుట్రలో భాగంగా రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అయిన సందర్భంగా శ్రామిక రైతు, కార్మిక, విద్యార్థి, యువజన పక్షాన నేటికి నిలబడ్డామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాలకిషన్, పరమేశ్వర్‌గౌడ్, సురేష్, రాము, అల్వాల్‌రెడ్డి, కృష్ణయాదవ్, రాజు, పద్మావతి, సత్యానారాయణరెడ్డి, బాష, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీస్తున్న ప్రజలు

- జాబితాలో పేర్లు లేకపోవడంపై గ్రామాల్లో ఆందోళనలు
- అధికారులను నిలదీస్తున్న ప్రజలు



జాబితాలో పేర్లు లేకపోవడంపై బలీదుపల్లిలో అధికారులను చుట్టుముట్టి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

మూసాపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామసభ నిర్వహించారు. బుధవారం మూసాపేట మండల కేంద్రంతో పాటు కొమిరెడ్డిపల్లి, తుంకినిపూర్ గ్రామసభ నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి జాబితాలను చదివి వినిపించారు. అర్హత కలిగిన జాబితాలో పేర్లు రానివారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీవో అనురాధ, ఏపీవో పులేందర్, ఏపీఎం వెంకటాచారి, శెట్టి చంద్రశేఖర్, బగ్గికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బలీదుపల్లిలో గ్రామస్థుల ఆందోళన

అడ్డాకుల మండలం బలీదుపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో తమ పేర్లు రాలేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో కూలీ పని చేసిన వారి పేర్లు చాలా వరకు గల్లంతయ్యాయని, మిగతా పథకాల్లో కూడా పేర్లు లేకపోవడంతో అధికారులను చుట్టుముట్టి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జాబితాలో కొందరు కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వ్యక్తుల పేర్లు కూడా రాలేదని గందరగోళం సృష్టించారు.

మిడ్జిల్: మండలంలోని చౌటకుంటతండా, రాజీపేట, మంగళిగడ్డతండా, మున్ననూర్, పెద్ద గుండ్లతండా, వాడియాలలో బుధవారం అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. రేషన్ కార్డుల జాబితాలో కొందరి పేర్లే వచ్చాయని, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేవని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో గీతాంజలి పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నాం

హన్వాడ : ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నామని మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత అన్నారు. లబ్ధిదారుల వివరాలతో బుధవారం అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. హన్వాడలో చైర్‌పర్సన్, రామన్నపల్లిలో ఎంపీడీవో యశోదమ్మ, కొనగట్టుపల్లిలో తహసీల్దార్ కిష్టునాయక్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట: మండలంలో బుధవారం గ్రామసభలు కొనసాగాయి. ఎంపీడీవో జయరాములు, తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ గాయత్రి లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు వినతులు స్వీకరించారు.

రెండో రోజు 572 దరఖాస్తులు

చిన్నచింతకుంట: మండలంలోని గూడూరు, ఉంద్యాల, దమగ్నాపూర్, బండర్‌పల్లి, పర్దీపూర్, గోప్యానాయక్ తండాలో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. ఇందిరమ్మ భరోసాకు 43, రేషన్‌కార్డులకు 472, ఇందిరమ్మ ఇళ్ల కోసం 57 దరఖాస్తులు వచ్చాయి.

మహమ్మదాబాద్: మండలంలోని గాదిర్యాల్, దేశాయపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. నోడల్ అధికారి చత్రునాయక్, తహసీల్దార్ తిరుపతయ్య, ఏవో తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయం

- ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఆర్కే స్పోర్ట్స్ కరాటే డూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2వ తేదీన జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి ఎంపీ కప్-2025 కరాటే పోటీలు నిర్వహించనున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎంపీ టోర్నీ పోస్టర్, ట్రోఫీలను ఆవిష్కరించారు. అకాడమీ ఫౌండర్ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లా నుంచి కరాటే విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అడ్వైజర్ విజయ్‌కుమార్, రాములు, కౌన్సిలర్ చెన్నవీరయ్య, మాస్టర్లు నిఖిల్, జయదీప్, రోహిత్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలుగకుండా వసతులు



పలుగుతండా పంచాయతీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

- ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి
- పలు పంచాయతీ కార్యాలయాల ప్రారంభోత్సవం

కోయిలకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీ డీకే అరుణ, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గార్లపహాడ్, కోయిలకొండ, ఇబ్రహీంనగర్, అంకిళ్ల, అయ్యవారిపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి చెందాలంటే గ్రామాల్లో నాయకులు, ప్రజలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కృషి చేస్తామన్నారు. రైతులకు సమయానికి ఎరువులు, విత్తనాలు సమకూర్చాలన్నారు. అనంతరం పలు పంచాయతీ కార్యాలయాలను ప్రారంభించారు. మత్స్యకారులకు స్వయం ఉపాధి కోసం కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అర్హులందరికీ అందుతాయని ఇందులో ఎలాంటి ఆందోళనలు అవసరం లేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు గార్లపహాడ్‌ను మండలంగా చేస్తామని, ఇందుకోసం ముఖ్యమంత్రితో మాట్లాడుతామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్, విద్యసాగర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, యాదవకుమార్, రామస్వామి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండీడ్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దవార్వాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. ఆరోగ్యశ్రీ రూ.10లక్షలకు పెంపు, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సౌకర్యం, రూ. 500లకు గ్యాస్ సిలిండర్‌ను అందించడం జరిగిందన్నారు. రెండో ఏటనే మరో నాలుగు కొత్త సంక్షేమ పథకాల అమలుకు కార్యచరణను ప్రారంభించామన్నారు. గత పాలనకు, నేటి పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు హనుమంతురావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు చెల్లించండి

- డీపీవో పార్థసారథి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పంచాయతీలలో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలను ప్రభుత్వం విడుదల చేసిందని, వాటిని నేరుగా ఖాతాలలో జమచేయాలని డీపీవో పార్థసారథి ఎంపీవోలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో అన్ని మండలాల ఎంపీవోలతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు వేతనాలు రూ 3,81,90,000 విడుదల చేసిందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించి ప్రభుత్వం రూ.6,99,44,002 నిధులు విడుదల చేసిందని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు చేపట్టిన వారికి చెల్లింపులు చేపట్టాలన్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రభుత్వం ఎప్పుడైన నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నందున ఎంపీడీవోలు, ఎంపీవోలు కలిసి పనిచేయాలన్నారు. ఎన్నికల బ్యాలెట్ పేపర్ ముద్రణ కొనసాగుతుందన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందిగా ఆదేశించారు.



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీపీవో పార్థసారథి

సీనియర్ సిటిజన్లు, యువతకు వాకింగ్ ట్రాక్

- మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ వాకర్స్‌తో మాట్లాడుతూ త్వరలో మైదానంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని, సీనియర్ సిటిజన్లు, యువతకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. యోగా షెడ్ కోసం అనువైన స్థలం గుర్తించి నిర్మాణం చేపడుతామన్నారు. సాయంత్రం వాకర్స్‌కు ఇబ్బందులు కలుగకుండా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్, శివరాజ్, రంగారెడ్డి, శ్రీనివాస్, చెన్నారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

బాలానగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను జడ్చర్ల పట్టణంలోని ఫిబ్రవరి 3వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిట్టల మురళి, నాయకులు రఘుపతిరెడ్డి, శ్రీశైలంయాదవ్, వెంకటచారి, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోడ్గల్ యాదయ్య